నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I హైదరాబాద్, బుధవారం 4 డిసెంబర్ 2024 | HYDERABAD

## సర్వే వివరాల ఎంట్రీలోనూ నిర్లక్ష్యమే!

**గ్రేటర్‌లో ఆలస్యంగా పూర్తయిన సర్వే**

**కొన్ని చోట్ల నేటికి ప్రారంభం కానీ డేటా ఎంట్రీ**

సిటీబ్యూరో, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో ఇంటింటి కుటుంబ సర్వేలోనే కాదు.. వివరాల డేటా ఎంట్రీ ప్రక్రియ ఆలస్యమవుతున్నది. ఈ నెల 9వ తేదీ లోపు డేటా ఎంట్రీ పూర్తి చేసుకుని రిపోర్టు ఇవ్వాలని కమిషనర్ ఇలంబర్తి ఆదేశాలు జారీ చేశారు. సర్వే డేటా ఎంట్రీ ప్రక్రియ సర్కిళ్ల వారీగా చేపట్టాలని, డేటా నమోదు సమయంలో ఎక్కడా పొరపాట్లు జరగకుండా, కోడింగ్ సరైన విధంగా ఉండేలా చూడాలని అధికారులకు కమిషనర్ సూచించారు. అయితే నేటి వరకు కొన్ని చోట్ల వివరాలు డేటా ఎంట్రీకి నోచుకోలేదు. ఏజెన్సీలను ఖరారు చేయకపోవడం అధికారుల పనితీరుకు నిదర్శనం. ఈ నేపథ్యంలోనే నిర్ణీత వ్యవధిలోపు డేటా ఎంట్రీ పూర్తి చేస్తారా? లేదా? అన్నది వేచి చూడాల్సిందే. గత నెల 6న మొదలైన సర్వేలో 95 శాతం మంది వివరాలను సేకరించారు. మిగతా 5 శాతం మందిలో కొందరు తమ సొంతూర్లలో వివరాలు ఇస్తామని, మరికొందరు వివరాలు చెప్పేందుకు నిరాకరించారు. మొత్తంగా గ్రేటర్‌లో 29, 58,277 కుటుంబాలుండగా, 1,47,913 మంది కుటుంబాలు వివిధ కారణాలు చెప్పి సర్వే వివరాలు ఇవ్వలేదు.

## చెట్లను నరికేందుకు హెచ్‌ఎండీఏ సన్నాహాలు

**పర్యావరణ వేత్తల ఆందోళన**

సిటీబ్యూరో, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): నగరంలో ఓవైపు కాలుష్యం తీవ్రత పెరుగుతుంటే, మరోవైపు ప్రాణవాయువును అందించే భారీ వృక్షాలను కూల్చేందుకు హెచ్‌ఎండీఏ సన్నాహాలు చేస్తుంది. రోడ్డు విస్తరణ కోసం ఏకంగా 470 వృక్షాలను హెచ్‌ఎండీఏ తొలగించనుంది. దీనికి అవసరమైన అనుమతుల కోసం ఏకంగా రూ.7లక్షలు ఖర్చు చేయనుంది. మియాపూర్ చౌరస్తా నుంచి గండిమైసమ్మ వెళ్లే మార్గంలో రోడ్డు విస్తరణ పనులు చేపడుతుంది. దీనికి అడ్డుగా ఉన్న చెట్లను తొలగించడంతో పాటు, కొన్నింటిని ట్రాన్స్ లొకేట్ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. దాదాపు వెయ్యి వృక్షాలను ట్రాన్స్ లొకేట్ చేయనుండగా... మరో 470 చెట్లను పక్కన పెట్టేయనున్నారు. అయితే హెచ్‌ఎండీఏ తీసుకున్న నిర్ణయం ఇప్పుడు స్థానికంగా ఆందోళన కలిగిస్తోంది. ఈ క్రమంలో భారీగా పెరిగిన చెట్లను తొలగించడం వల్ల కాలుష్యం తీవ్రత పెరుగుతుందని స్థానికులు, పర్యావరణ, సామాజిక కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



# ఇండ్లు కూలినా.. ఈఎంఐ కడుతున్నాం!

**కూల్చి వేతలు..**

## గూడు చెదిరిపోయినా తప్పని వ్యథలు

**మా గోడు వినేవారెవరు.. నష్టాన్ని పూడ్చేవారెవరు..!**

**రుణాల ఊబిలో కూరుకుపోతున్న హైడ్రా కూల్చివేతల బాధితులు**

**హైడ్రా కూల్చేసిన ఇళ్ల యజమానుల కన్నీటి వెతలు**

నాలుగు నెలల క్రితం హైడ్రా వచ్చింది.. మా ఇల్లు కూల్చేసింది.. ఎందుకు కూల్చారో తెలియదు.. ఎఫ్‌టీఎల్ అన్నారు. కూలగొట్టిపోయారు.. బ్యాంకుల్లో తీసుకున్న హౌసింగ్‌లోన్ ఈఎంఐలు మాత్రం కట్టక తప్పడం లేదు. మేము అవునన్నా.. కాదన్నా నెల కాగానే ఈఎంఐ ఠంచన్‌గా కట్ అవుతూనే ఉంది. ఎంతో ఇష్టంగా కట్టుకున్న ఇల్లూ పోయింది.. దానికి తోడు ఇంటి పేరు మీద తీసుకున్న లోన్ పేరుతో మా డబ్బులు పోతున్నయ్. మేం ఎవరికి చెప్పకున్నా లాభం లేదు. నెలకు యాభైవేలకు పైగానే కట్ అవుతున్నాయి. ఇది అన్యాయం. మధ్యతరగతి వారిపైనే మీ ప్రతాపమా. అసలు అనుమతులిచ్చిందెవరు.. బ్యాంకులు లోన్ ఇచ్చేటప్పుడు వెరిఫికేషన్‌లోనే డాక్యుమెంట్స్ సరైనవా కావా తేల్చేస్తారు. మరి వాళ్లకు కూడా చెరువులో కట్టామని తెలియదా.. 2019లో కొన్న ఇంటికి ఇప్పుడు ఎఫ్‌టీఎల్ గుర్తుకు వచ్చిందా.. ఇదేం తీరు. హైడ్రా పేరుతో భయపెడుతున్నారు. మా జీవితాలు నాశనం చేశారు. మీరెలా బాగుపడుతారంటూ ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

- సిటీబ్యూరో/దుండిగల్, డిసెంబర్ 3(నమస్తే తెలంగాణ)

హైడ్రా చేసిన గాయాలు మానడం లేదు. ఒకవైపు ఇల్లు నేలమట్టమై కంటిముందు కనిపిస్తుంటే . మరోవైపు ఈఎంఐలు కట్టాలంటూ బ్యాంకుల ఒత్తిడి ఆగడం లేదు. బ్యాంకులు ఇళ్ల నిర్మాణానికి లోన్లు ఇవ్వాలంటే రిజిస్ట్రేషన్, జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏల నుంచి అనుమతులు తీసుకున్నారా లేదా చెక్ చేసిన తర్వాతే రుణాలు ఇస్తారు. ఈ మూడు శాఖలు ఇచ్చిన సర్టిఫికెట్లను చెక్ చేసి న్యాయ నిపుణుల సలహాలతోనే ఈ ఇళ్లకు రుణాలు మంజూరు చేస్తాయి. బ్యాంకులు లోన్లు ఇచ్చేటప్పుడు చూసుకున్న డాక్యుమెంట్లన్నీ సరిగా ఉంటేనే కదా లోన్లు ఇచ్చేది.. మరి అలాంటిది తమ ఇల్లు బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్‌లో ఉంటే బ్యాంకులు లోన్లు ఎలా ఇచ్చాయి.. రిజిస్ట్రేషన్లు ఎలా జరిగాయి.. మాది తప్పంటూ ఇళ్లు కూల్చేసి మేము రోడ్డున పడ్డాక ఇప్పుడు ఈఎంఐలు బలవంతంగా కట్ చేయడమేంటి.. బాధితులు కన్నీటిపర్యంతమవుతూ వేస్తున్న ప్రశ్నలివి. హైడ్రా రెండున్నర నెలల్లో చేసిన కూల్చివేతల్లో పేద, మధ్యతరగతి వారే ఎక్కువగా నష్టపోగా.. వారి జీవితాలు అగమ్యగోచరంగా మారాయి. పుండుపై కారం చల్లినట్లు ఒకవైపు ఇల్లు కూలగొట్టారంటూ వాళ్లు బాధపడుతుంటే ఈఎంఐలు కట్టించుకోవడంలో బ్యాంకులు మాత్రం తమ పని తాము చేసుకుపోతున్నాయి. మల్లంపేట్ కత్వా చెరువు వద్ద విల్లాల యజమానులు ఈఎంఐలు కట్ అవుతూ నానా అవస్తలు పడుతున్నారు. తమ కలల సౌధాన్ని కంటి ముందే కూల్చేస్తుంటే కాళ్లావేళ్లా పడ్డా హైడ్రా అధికారులు వినకుండా కూల్చేశారంటూ పుట్టెడు దుఃఖంతో చెబుతున్నారు. ఒకవైపు ఇల్లు కూల్చేసి పోతుంటే ఉన్న జాగ అయినా తమది అవుతుందనుకుంటే అది పేపర్ల మీద ఉంటుంది తప్ప మీది కాదని అధికారులు చెబుతున్నారంటున్నారు. బ్యాంకులకు ఈఎంఐలు చెల్లించడం విషయంలోనైతే వారి బాధ వర్ణనాతీతం. ప్రతీనెల ఠంచనుగా తమ ఎకౌంట్ నుంచి ఈఎంఐలు కట్ అవుతూనే ఉన్నాయని చెప్పారు. వారికి రుణాల కోసం షూరిటీ ఇచ్చిన వారు సైతం లోన్ ఈఎంఐ కట్టకపోతే తమ జీతాల్లో ఎక్కడ కోత పెడుతారోనంటూ ఈ బాధితుల చుట్టే తిరుగుతున్నారు. కోట్లు ఖర్చు చేసి కట్టుకున్న విల్లాల నుంచి లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన ఇళ్ల వరకు హైడ్రా నష్టాన్నే మిగిల్చింది. అయితే ఈ నష్టాన్ని ఎవరు మోయాలన్న ప్రశ్న వ్యక్తమవుతోంది.

### ఇల్లు లేదు కానీ ఈఎంఐ మాత్రం కట్ అవుతుంది..!

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మల్లంపేటలోని కత్వా చెరువు వద్ద 17 విల్లాలను హైడ్రా కూల్చివేసింది. లక్షలాది రూపాయల లోన్ తీసుకుని నిర్మించుకున్న ఇళ్లు నేలమట్టమైనా బ్యాంకుల వేధింపులు మాత్రం ఆగడం లేదు. కత్వా చెరువు వద్ద కూల్చేసిన విల్లాల బాధితులను కదిలిస్తే కన్నీళ్ల పర్యంతమవుతున్నారు. అయితే వారిలో బహిరంగంగా మాట్లాడటానికి ఎవరూ ముందుకు రావడం లేదు. వారందరిలో ఎక్కడో ఒక చిన్న ఆశ.. తమకు ప్రభుత్వం న్యాయం చేయకపోతుందా అని ఎదురు చూస్తున్నారు. కానీ సర్కార్ మాత్రం వారివైపు కన్నెత్తి చూడటం లేదు. ముఖ్యంగా కూల్చేసిన ఇళ్ల డెబ్రిస్ తీయడానికి ఒక్కో విల్లాకు తమకు రూ.3లక్షల ఖర్చయిందని బాధితులు చెబుతున్నారు. అసలు విల్లానే లేదు.. ఈఎంఐ కట్టడం మాత్రం తప్పడం లేదు.. బ్యాంకులకు వెళ్లి తమ పరిస్థితి చెబితే వారు డైరెక్ట్‌గా తమ దగ్గర ఉన్న డాక్యుమెంట్స్ చూపించి మీరే సంతకం పెట్టారు.. కట్టాల్సిందే అంటూ సమాధానమిస్తున్నారు. మా లోన్‌కు, ప్రభుత్వ నిర్ణయాలకు సంబంధం లేదని .. ఎమ్మార్వో , సబ్ రిజిస్ట్రార్ ఎందుకు క్లియరెన్స్ ఇచ్చారో మాకు సంబంధం లేదని బ్యాంక్‌వాళ్లు చెబుతున్నారు. ఇక రిజిస్ట్రేషన్ ఆఫీస్‌కు వెళ్లి తమ విల్లా చెరువుల హద్దుల్లో ఉంటే ఎలా రిజిస్ట్రేషన్ చేశారని అడిగితే ఆ సమయంలో మా సైట్‌లో చెరువుల ఎఫ్‌టీఎల్ వివరాలే లేవు. మాకు ఎలాంటి బ్లాక్ లిస్ట్ ఇవ్వలేదంటూ సమాధానమిచ్చారు. ఎమ్మార్వో, సబ్‌రిజిస్ట్రార్, బిల్డర్, బ్యాంక్, ఇరిగేషన్ అధికారులు.. వీరంతా తమ నష్టానికి బాధ్యులేనని అంతెందుకు ఏకంగా ప్రభుత్వమే నష్టాన్ని పూరించాలంటూ డిమాండ్ చేస్తున్నారు.

### కమిషనర్‌ను కలిసినా న్యాయం జరగలేదు..!

హైడ్రా కూల్చివేతల బాధితులు తమ గోడు చెప్పుకోవడానికి హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిశారు. ఆయన బిల్డర్‌తో మాట్లాడుకోమన్నారు. బిల్డర్ తాను కరెక్ట్‌గానే ఇల్లు కట్టానని చెబుతున్నారు. కానీ ఎందుకు కూల్చేశారో తెలియడం లేదంటున్నారని విల్లాల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఇటీవల రంగనాథ్ స్వయంగా అనాథరైజ్డ్ ఇళ్లైనా, నివాసగృహాలు అయితే కూల్చేది లేదంటూ ఇచ్చిన స్టేట్‌మెంట్‌తో వారు తమకు కూడా న్యాయం జరుగుతుందని.. నష్టపరిహారం ఇవ్వడమో, వేరొక చోట ఇల్లు ప్రత్యామ్నాయంగా ఇవ్వడమో చేస్తారని భావించారు. కానీ రంగనాథ్‌ను కలవడానికి ప్రయత్నిస్తే అవకాశమే ఉండటం లేదని, ఎవరినో కలవమంటే అతనిని కలిశామని అతను కేవలం పేపర్ మీద మీ బాధ రాసి ఇవ్వండి నేను సార్‌కు ఇస్తా అన్నాడు.. తప్ప మా బాధలు వినేవారు లేరు.. మాకు న్యాయం చేసే వారు లేరంటూ కన్నీటి పర్యంతమవుతున్నారు. తాము కట్టుకున్న ఇళ్లు పోయి ఏం చేయాలో తెలియక బ్యాంక్ లోన్ వేరే బ్యాంక్‌కు ట్రాన్స్‌ఫర్ చేసి దానిపై ఇన్సూరెన్స్ పాలసీ తీసుకుని రెండు నెలల తర్వాత నాచురల్ డెత్ ప్లాన్ చేస్తే కనీసం ఆ ఇల్లు అయినా మిగులుతుందని ఆవేదనగా చెబుతున్నారు.

### నష్ట పరిహారం ఉండదు : హైడ్రా అధికారి

తాము కూల్చేసిన ఇళ్లకు నష్టపరిహారం అంటూ ఏమీ ఉండదని హైడ్రా అధికారి చెప్పారు. మల్లంపేట్ విల్లాల కూల్చివేతల తర్వాత తమ ఆఫీసుకు విల్లాల యజమానులు వచ్చినా తమ పరిధిలో తాము పనిచేశామని బిల్డర్‌తో మాట్లాడమని చెప్పాం. కూల్చివేతలకు నష్టపరిహారం కానీ ప్రత్యామ్నాయ ఇళ్లు చూపించడం కానీ ఉండదు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో కట్టిన విల్లాలను కూల్చేశాం.

### ఇల్లు లేకుండానే లోన్ కడుతున్నాం



కత్వా చెరువు సమీపంలో విల్లా కొనేందుకు రూ.70 లక్షల లోన్ తీసుకున్నాను. నాలుగు నెలల క్రితం మా ఇల్లు హైడ్రా కూల్చేసింది. అయినా ప్రతీనెలా రూ.51,258 ఈఎంఐ నా అకౌంట్ నుంచి కట్ అవుతోంది. న్యాయం కోసం ప్రతీ అధికారిని కలిశాం. ఎక్కడా మా గోడు వినే దిక్కే లేదు. ఇదెక్కడి ప్రభుత్వం. మా ఇల్లు కూల్చేసి మాకు వేరే దారి చూపించదా. బ్యాంక్‌లకు వెళ్లి ఏదైనా రిక్వస్ట్ చేస్తే వన్ టైమ్ సెటిల్‌మెంట్ చేసుకోండి.. అంటున్నారు.. తప్ప మా నష్టాన్ని పట్టించుకోరట. ఇక హైడ్రా ఆఫీస్‌కు వెళ్లినా.. కమిషనర్‌ను కలిసినా ఏం ఫలితం లేదు. న్యాయం కోసం ఎక్కడికి వెళ్లాలి.. ఎవరిని కలవాలి. సర్కార్ తీరే బాగా లేదు. పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఎందుకింత పగపెట్టుకుందో అర్థం కావడం లేదు మాకు తెలిసి మేం చెరువుల్లో ఇళ్లు కట్టుకుంటామా. ఇల్లు కొనుక్కున్న తర్వాత ఇలా కూల్చివేస్తే ఎంత బాధ. అది రేవంత్‌రెడ్డికి తెలియడం లేదా. మేం కట్టే ఈఎంఐ డబ్బులతో మా పిల్లలు బాగుపడరా. ఇల్లు ఉంటే లోన్ కట్టినా సంతోషపడే వాళ్లం. ఇలా లేని ఇంటికి ఎలా కట్టాలి.

- శశాంక్, మల్లంపేట

కత్వా చెరువు వద్ద హైడ్రా కూల్చేసిన విల్లా(ఫైల్)



## మూసీలో కెమికల్ డంపింగ్

**స్థానికుల ఫిర్యాదుతో మేల్కొన్న పీసీబీ అధికారులు**

**రుద్ర టెక్నాలజీస్‌ను మూసివేస్తూ ఉత్తర్వులు**

సిటీబ్యూరో, డిసెంబర్ 3(నమస్తే తెలంగాణ): స్థానికులు ఫిర్యాదులు చేస్తే గానీ పీసీబీ అధికారులు కదిలే పరిస్థితి లేదు. నవంబర్ 26న అర్ధరాత్రి మూసీలోకి కెమికల్స్ డంప్ చేస్తున్నట్లు స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుపై ఎట్టకేలకు పీసీబీ అధికారులు చర్యలకు పూనుకున్నారు. ఓవైపు మూసీ ప్రక్షాళనపై ప్రభుత్వం ఎడతెగని ప్రసంగాలు చేస్తుంటే.. మరోవైపు మూసీలో గుట్టుగా రసాయనిక వ్యర్థాలను వదులుతున్న పరిశ్రమలపై మరింత పకడ్బందీగా వ్యవహరించాల్సిన పీసీబీ అధికారుల నిర్లక్ష్యం బట్టబయలు చేసేలా తాజా ఘటన జరిగింది. నవంబర్ 26న సంగారెడ్డికి చెందిన రుద్ర టెక్నాలజీస్ అనే కంపెనీ నుంచి వెలువడిన 12కేఎల్డీల వ్యర్థాలను ట్యాంకర్ ద్వారా తరలించి అత్తాపూర్‌లోని బాపుఘాట్ సమీపంలో మూసీలోకి విడుదల చేశారు. అర్ధరాత్రి సమయంలో గుట్టుగా ఈ వ్యవహారం సాగుతున్నా... ఇన్నాళ్లు పట్టించుకోని పీసీబీ యంత్రాంగం... లంగర్ హౌజ్ నివాసితుల ఫిర్యాదుతో కదిలారు. బాపూఘాట్ బ్రిడ్జి వద్ద, హైదర్‌గూడ, అత్తాపూర్ ప్రాంతాల నివాసితులు ఈ తతంగాన్ని వెలుగులోకి తీసుకురావడంతో... ఈ వ్యవహారంపై విచారణ చేపట్టారు. దీంతో బాపూఘాట్ వంతెన సమీపంలో ఉండే ఇసుక, కంకర, మెటల్ వ్యాపార కేంద్రంలో వేసిన పైపులైన్ ద్వారా మూసీలోకి కెమికల్స్ వదులుతున్నట్లు గుర్తించారు. యధేచ్ఛగా ఈ వ్యవహారం సాగుతుండటంతో సమీపంలో ఉండే నీరు, నేల నమూనాలను సేకరించిన పీసీబీ అధికారులు... రసాయనిక కాలుష్య కారకాలు ఉన్నట్లు తేల్చారు. అయితే 2023లోనే జల వనరుల్లోకి రసాయన వ్యర్థాలు వదులుతున్నట్లు గుర్తించి శ్రీనివాస ల్యాబ్‌ను మూసివేశారు. కానీ తాజాగా ఈ కంపెనీ రుద్ర టెక్నాలజీస్ పేరిట వ్యర్థాల తరలింపు వ్యవహారాలను గుట్టుగా కొనసాగిస్తున్నది. ఈ వ్యవహారం స్థానికులు వెలుగులోకి తీసుకురావడంతో ఎట్టకేలకు కంపెనీని మూసీ వేయాలని పీసీబీ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. వాడేసిన యాసిడ్‌ను వినియోగించి జిప్సం తయారీ కార్యకలాపాలు కొనసాగిస్తోంది. సీఎఫ్‌ఓ నిబంధనలను ఉల్లంఘిస్తూ సాగుతున్న ఈ వ్యవహారంతో కాలుష్య వ్యర్థాలు యధేచ్ఛగా సాగుతూనే ఉన్నాయి. కాగా స్థానికులు ఫిర్యాదులు చేస్తే తప్ప.. మూసీ, జల వనరులను కలుషితం చేస్తున్న పరిశ్రమలపై ఇకనైనా దృష్టి పెట్టాలని పలువురు పర్యావరణ, సామాజిక కార్యకర్తలు కోరుతున్నారు.




తనిఖీలు చేస్తున్న పీసీబీ అధికారులు

## దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి

- దివ్యాంగులకు రూ.6000 పింఛన్ చెల్లించాలి
- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, డిసెంబర్ 3: దివ్యాంగుల సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మల్కాజిగిరిలోని పద్మావతి హాల్, అల్వాల్ సర్కిల్ ఇందిరానగర్‌లోని కనకరాజు కల్యాణ మండపంలో దివ్యాంగులకు వీల్ చైర్లు, చేతి కర్రలను ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీల్లో భాగంగా దివ్యాంగుల పింఛన్‌ను రూ.6000లకు పెంచుతామని ఉపన్యాసాలతో ఊదరగొట్టారని అన్నారు. ఎప్పుడో గుప్పించిన హామీలను ఇప్పటికీ అమలు చేయకపోవడంతో దివ్యాంగులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పింఛన్లు పెంచేవరకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని, అసెంబ్లీలో ప్రత్యేకంగా దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం మాట్లాడుతామన్నారు. దివ్యాంగుల పట్ల అధికారులు అంతా సానుకూలంగా ఉండి వారి సమస్యలు పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. ప్రతి నెలా ప్రభుత్వ దవాఖానలో సదరం క్యాంపు ఏర్పాటు చేసి వారికి దివ్యాంగుల సర్టిఫికెట్లు సకాలంలో అందేలా కృషి చేస్తామన్నారు. ఇప్పటికే గుర్తించిన దివ్యాంగులకు వీల్ చైర్లు, ట్రై సైకిళ్లు, చేత కర్రలను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మల్కాజిగిరి, అల్వాల్ సర్కిళ్ల డీసీలు రాజు, శ్రీనివాస్ రెడ్డి, పీఓలు మల్లికార్జున్, కార్పొరేటర్లు శ్రావణ్, శాంతి శ్రీనివాస్ రెడ్డి, ఏఎంహెచ్ఓ నిర్మల, బాబు తదితరులు పాల్గొన్నారు.



మల్కాజిగిరిలోని పద్మావతి హాల్ లో దివ్యాంగులకు చేతి కర్రలు, వీల్ చైర్‌లు అందజేస్తున్న మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



అల్వాల్ సర్కిల్ ఇందిరానగర్‌లోని కనకరాజు కల్యాణ మండపంలో దివ్యాంగులకు వీల్ చైర్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



జల్‌పల్లిలో షాదీముబారక్ చెక్కులను అందజేస్తున్న మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి

## హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఏది ?
- బస్తీ దవాఖానలో డాక్టర్లు లేరు.. మందులు లేవు
- ప్రజల దాహార్తిని తీర్చిన బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్
- మిషన్ భగీరథతో ప్రతి ఇంటికి మంచినీరు
- ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, డిసెంబర్ 3: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని ప్రజలకిచ్చిన హామీని ఎందుకు నెరవేర్చడం లేదని ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి ప్రశ్నించారు. జల్‌పల్లి మున్సిపాలిటీలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు మంగళవారం ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు ఇచ్చిన వారందరికి తులం బంగారం ఇచ్చే వరకు కాంగ్రెస్ నేతలను నిలదీయాలన్నారు. మహిళలను మోసం చేస్తున్న ప్రభుత్వాన్ని ఎండగట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఏ ఒక్కటి అమలు చేయడం లేదన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో కేసీఆర్ కోట్ల రూపాయలతో నిర్మాణం చేసిన రిజర్వాయర్లను నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభిస్తున్నారని.. కొత్తగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి శూన్యం అన్నారు. ప్రజాపాలన పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. మార్పు పేరుతో ప్రజలను మాయ చేశారన్నారు.

**ప్రజల దాహార్తిని తీర్చిన ఘనత కేసీఆర్‌దే..**

భవిష్యత్‌లో నీటి సమస్య రాకుండా ఉండటానికి బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ మిషన్ భగీరథ పథకం ద్వారా నీటి సమస్య లేకుండా చేశారని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి గుర్తు చేశారు. హైదరాబాద్ శివారు పరిధిలో ఉన్న మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, రాజేంద్రనగర్, ఎల్బీనగర్, ఉప్పల్ నియోజక వర్గాల్లో ఉన్న నీటి సమస్యను పరిష్కరించడానికి రూ.1200 కోట్లు, మహేశ్వరం నియోజకవర్గానికి రూ.260 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. కేసీఆర్ నిర్మించిన రిజర్వాయర్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభిస్తున్నారని చెప్పారు. ప్రజలకు రోజు విడిచి రోజు తాగునీరివ్వాలని, పాత పైపులైన్లు తొలగించి నూతన పైపులైన్లు వేయించాలన్నారు.

**మెరుగైన వైద్యం కోసమే బస్తీ దవాఖానలు ఏర్పాటు..**

రాష్ట్రంలో ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి బస్తీ దవాఖానలను అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఏర్పాటు చేయించారన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోనే 13 బస్తీ దవాఖానలు, 9 అర్బన్ సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బస్తీ దవాఖానల్లో డాక్టర్లు లేరని, మందుల కొరత ఉందని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీకి గతంలో కేటాయించిన రూ.50 కోట్ల నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో బాలాపూర్ తాసీల్దార్ ఇంద్రాదేవి, చైర్మన్ అబ్దుల్లా, వైస్ చైర్మన్ ఫర్హానా, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు తదితరులు ఉన్నారు.